క్లుప్తంగా

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ శ్రీమారుతీనగర్, చంద్రవిహార్ కాలనీ, వసంత్‌విహార్ ఫేస్–1,2, ప్రెస్ కాలనీల్లో బుధవారం డ్రైనేజీ, సీసీరోడ్డు పనులను మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, స్థానిక కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్‌తో కలిసి పనులు ప్రారంభించారు. అన్ని డివిజన్లల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా మొదలుపెట్టి పూర్తిచేయిస్తామని మేయర్ పారిజాత అన్నారు. కార్యక్రమంలో ఏఈ బిక్కునాయక్, నాయకులు గట్టు బాలకృష్ణ, నరేశ్, ప్రదీప్, కాలనీవాసులు, మహిళలు ఉన్నారు.

రైతులకు రుణాలు అందజేత



రైతులకు చెక్కులు అందజేస్తున్న చైర్మన్ పెంటారెడ్డి

బడంగ్‌పేట్: ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీలో రుణాలు మాఫీ అయిన రైతులకు బాలాపూర్ బండ్లగూడ ఖాల్సా సహకార సొసైటీలో కొత్త రుణాలు అందజేశారు. బుధవారం సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి రుణాలు తీసుకున్న రైతులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా పెంటారెడ్డి మాట్లాడుతూ.. రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. అందుకే ఏకకాలంలో 2 లక్షల రుణాలను మాఫీ చేసిందన్నారు. బాలాపూర్ ఖల్సా సొసైటీ నుంచి రుణమాఫీ పొందిన రైతులు తిరిగి రుణాలకు దరఖాస్తు చేసుకున్న వెంటనే 9 మంది రైతులకు రూ.5లక్షల రుణాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో సీఈవో ఎర్ర జైహింద్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్, హ్యాండ్‌క్రాఫ్ట్ మేళాకు ఆదరణ

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హెచ్‌ఎండీఏ ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ హ్యాండ్‌క్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్)కు ఆదరణ లభిస్తోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నోచికాన్, బనారస్ చీరలు, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, గాజులు, బ్యాగులు, తదితర ఉత్పత్తులు సరసమైన ధరలకే లభిస్తాయని నిర్వాహకులు అక్బర్‌అలీ తెలిపారు.

సమ్మె నోటీస్ అందజేత

తలకొండపల్లి: సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు గురువారం మండల కేంద్రంలో ఒక్క రోజు సమ్మె నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సంజీవరెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సేవలైన విద్యుత్, మంచి నీరు, సఫాయి బంద్ పేరిట గతంలో సమ్మె చేసినా ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం నేడు 48 గంటల పాటు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగయ్య, రాములు, ఏరియా కన్వీనర్ పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి పంచాయతీ ఉద్యోగులు సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డికి పంచాయతీ కార్మికులు నోటీసు ఇచ్చారు. పంచాయతీ ఉద్యోగులకు పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నంబరు 51 రద్దు చేయాలని వారు ఎంపీడీఓను కోరారు.

విరాళాల సేకరణ

ఇబ్రహీంపట్నం: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు సామేల్, యాదయ్యలు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో తుఫాన్ వరదలు రావడంతో కొండ చరియలు విరిగిపడి జనజీవనం అతులాకుతలం అయ్యిందన్నారు. మానవత్వంతో ఆ ప్రాంత ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లేశ్, శ్యాంసుందర్, జంగయ్య, యాదగిరి, శంకర్, నరసింహ, వీరేశం, బుగ్గరాములు, రవి, రాజాక్‌పాష, శ్రీకాంత్, వెంకన్న, వంశీ, శ్రీను, స్వాములు పాల్గొన్నారు.

కలగానే నూతన వంతెన

శిథిలావస్థకు చేరిన పాత కల్వర్టు

- నల్లా చెరువు నిండితే రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందుల్లో స్థానికులు, తండావాసులు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన వంతెన

తలకొండపల్లి: నల్లా చెరువు సమీపంలోని బ్రిడ్జి శిథిలావస్థకు చేరినా, పగుళ్లు వచ్చినా పట్టించుకునే వారు కరువయ్యారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జికి నేటి వరకూ కూడా మరమ్మతు పనులు చేపట్టడం లేదు. ఇది శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. కట్టిన రాళ్లు ఊడి పూర్తిగా ధ్వంసమైంది. సైడ్ గోడలు నెర్రలు బారాయి. అక్కడక్కడ కొన్ని ప్రదేశాలలో గోడలు కూలాయి. ఐనప్పటికీ ఆ వైపుగా చూసిన అధికారులే కరువయ్యారు. సమీపంలోని నల్లా చెరువు నిండితే బ్రిడ్జిపై నుంచి నీటి ప్రవాహం ఉంటుంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం ఈ ప్రభుత్వం అయినా పట్టించుకుంటుందని స్థానికులు ఆశిస్తున్నారు. పాత కల్వర్టు స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వర్షపు నీరు ఇలా..

వర్షపు నీరు లక్ష్మి తండా, బుద్యా తండాల మీదుగా ప్రవహిస్తూ మోదుగు కుంటకు చేరుతుంది. సుమారు 3 కిలో మీటర్ల మేర ప్రవహించి చంద్రధన ఫీడర్ చానల్, మోదుగు కుంట నుంచి కల్వర్టుల్లోకి చేరుతుంది. చెరువు నిండినప్పుడల్లా బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. గత రెండేళ్ల క్రితం చెరువు నిండి అలుగు పారింది. ఫలితంగా బ్రిడ్జి మీదుగా నీరు ప్రవహించి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.

బ్రిడ్జి పరిధిని పెంచాలి..

పాత కల్వర్టు స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. అంతేగాకా డబల్ రోడ్డుకు అనుగుణంగా నీటి ప్రవహం పోయేందుకు బ్రిడ్జి పరిధిని పెంచాలి. ఈ ప్రాంతం నుంచి డబుల్ రోడ్డు నిర్మించి 12 ఏళ్లు గడిచినా నేటి వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.



నల్లా చెరువు నిండడంతో బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

మరమ్మతులు చేయలేదు



50 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టుకు ఇప్పటి వరకూ ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టలేదు. ఫలితగా రాళ్లు ఊడిపోయి, కల్వర్టు శిథిలావస్థకు చేరి కూలిపోనుంది. ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేయించాలి. వెంటనే నూతన బిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి.

– బక్కి కుమార్, మాజీ సర్పంచ్, చంద్రధన

బ్రిడ్జి పరిధిని పెంచాలి



శిథిలమైన కల్వర్టుతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేగంగా నీరు ప్రవహించడానికి బ్రిడ్జి ఎత్తుతో పాటు పరిధిని పెంచి నూతన నిర్మాణం చేపట్టాలి. సమీపంలోని నల్లా చెరువు నిండి అలుగు పారితే ఈ కల్వర్టు మీదుగా నీటి ప్రవహం ఉంటుంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

– రాజు యాదవ్, రైతు, చంద్రధన

శిథిలావస్థకు చేరుకుంది



నల్లా చెరువు సమీపంలోని కల్వర్టు పూర్తిగా ధ్వసంమై శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రాణాలు అరచేత పట్టుకొని వాహన దారులు ప్రయాణిస్తున్నారు. ప్రమాదం జరుగకముందే నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

– భాను నాయక్, రైతు, పూల్‌సింగ్ తండా

దళితులకు న్యాయం చేస్తాం

మాజీ ఎమ్మెల్యేలు కేఎల్‌ఆర్, టీకేఆర్



భూములను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కేఎల్‌ఆర్, టీకేఆర్

బడంగ్‌పేట్: గత ప్రభుత్వ హయాంలో దళితులను దగా చేసి దళితులు సాగు చేసుకుంటున్న భూములను కబ్జా చేశారని ఇక నుంచి వారి ఆటలు సాగవని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని సర్వేనెంబర్ 46లో, బడంగ్‌పేట కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని సర్వేనెంబర్ 61లో తూముకుంట చెరువులో గల దళితుల భూములను బాధితుల కోరిక మేరకు పరిశీలించారు. వారి గోడును, దగాపడ్డ విషయాలను మాజీ ఎమ్మెల్యేలతో వెల్లబోసుకున్నారు. బాధితుల గాదలు విన్న అనంతరం తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను హుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు ఈ సర్వే నెంబర్లలో దళితులు సాగుచేసుకుంటున్న ఈ భూముల్లో తాను ఒక బావి తవ్వించి మోటార్ ఇప్పించానని గుర్తుచేశారు. ఏళ్ల నుంచి ఆ భూములను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించారని, భూములకు రెక్కలు వచ్చి దళితుల భూములపై కన్నుపడి కబ్జాలు చేయడం మొదలుపెట్టారన్నారు. దళితులకు తాము అండగా ఉంటామన్నారు. కేఎల్‌ఆర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలు గాని పట్టా కాగితాలు గాని ఎటువంటివి చెల్లవన్నారు. దళితుల భూములపై కన్నువేసిన ఎవరినైనా ఉపేక్షించేది లేదన్నారు. సాగులో ఉన్న నిజమైన రైతు కుటుంబాలకు పూర్తి న్యాయం చేస్తామని బరోసానిచ్చారు. భూములపై ఎవరైనా కబ్జాలకు పాల్పడినట్లు తెలిసినా రెవెన్యూ అధికారులు, పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బంగారు సత్యనారాయణ, బడంగ్‌పేట, మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, భూ దళితులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



తుక్కుగూడలో వీధులను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



బడంగ్‌పేట్: పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్న కార్పొరేటర్ స్వప్న, అధికారులు

తుక్కుగూడ: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. మున్సిపాలిటీలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మూడోరోజు పలు వార్డుల్లో అధికారులు మున్సిపల్ సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సీనియర్ అసిస్టెంట్లు వెంకటేశం, మల్లేశ్, వార్డు అధికారులు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లో బుధవారం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, వ్యర్థాలను, రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్వప్న మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. స్వచ్ఛదనం–పచ్చదనంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో డానియేల్, ప్రమోద్, బాబు, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



పాఠశాల లీడర్లుగా ఎన్నికైన విద్యార్థులతో సీఐ నాగరాజు

బడంగ్‌పేట్: పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని మీర్‌పేట్ సీఐ నాగరాజు అన్నారు. బుధవారం మీర్‌పేట నారాయణ పాఠశాలలో క్యాబినేట్ ఇన్‌స్టాలేషన్ (2024–25) కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన హౌస్ మెంబర్లకు సీఐ బ్యాడ్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకత్వ లక్షణాలతో యూనిటీపై పట్టు, దేశభక్తి, పటిమ, కమాండింగ్, ఏకాగ్రత, మానసిక, శారీరక ధైర్యం, ఆలోచనా భావాలు పెంపొందుతాయన్నారు. ఎన్నికైన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ బాబ్జి, ఏఓ మాధవి, ఏడీ రాజేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛదనం–పచ్చదనం



ఆయిల్‌బాల్స్ వదులుతున్న సిబ్బంది

ఎల్‌బీనగర్: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎల్‌బీనగర్ సర్కిల్–3లో పలు కాలనీల్లో కార్పొరేటర్లు, అధికారులు పర్యటించారు. మూసీ నదిలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేశారు. నాగోలు డివిజన్‌లో బండ్లగూడ ప్రధాన రహదారి, మన్సూరాబాద్ డివిజన్‌లోని పెద్ద చెరువు వద్ద వ్యర్థాలను తొలగించారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో హరిహరపురం కాలనీ ఫారెస్ట్ వద్ద దోమల నివారణకు ఆయిల్ బాల్స్‌ను వదిలారు. ఈ కార్యక్రమంలో డీసీ యాదయ్య, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, అధికారులు దివ్యజ్యోతి, లావణ్య, బలరాం, యాదగిరి, మేధా, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బైరామల్‌గూడ చెరువు వద్ద..

చంపాపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ చెరువు వద్ద ఇరిగేషన్ అధికారులచే ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కల పెంపకంపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ డీసీ జకియా సుల్తానా, శానిటేషన్ డీఈ వెంకటేష్, అధికారులు సత్యనారాయణ, శ్రీనివాస్, నాయకులు విజయ్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు



అసంపూర్తిగా ఉన్న క్యాచ్ పిట్ నిర్మాణం

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి నాగార్జున కాలనీలో డ్రైనేజీ వ్యవస్థలో భాగంగా వరదనీరు సాఫీగా వెళ్లడానికి చేపట్టిన క్యాచ్‌పిట్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఎస్ఎస్ గ్రాండ్ కాన్ఫరెన్స్‌హాల్ ఎదురుగా గత కొన్ని నెలల క్రితం క్యాచ్‌పిట్ నిర్మాణం చేపట్టారు. ఛాంబర్‌ను నిర్మించి రెండు నెలలు గడుస్తున్నా దానిపై కప్పు వేయకపోవడంతో వర్షాకాలం వరద నీటితో ప్రమాదం పొంచి ఉందని, ఆ దారిన వెళ్లేవారు ఛాంబర్ గుంతలో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు నాయిని శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్యాచ్‌పిట్ నిర్మాణాన్ని పూర్తి చేయించాలని కోరుతున్నారు.

హామీలు అమలు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ మోర్చా నేతలు

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ఎన్నికల ముందు చేవెళ్లలో నిర్వహించిన సభలో ఇచ్చిన ఎస్సీ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎస్సీ మోర్చా నేతలు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంబేడ్కర్ అభయ హస్తం కింద ప్రతి కుటుంబానికి రూ. 12లక్షల ఆర్థిక సహాయం, మాల, మాదిగ కార్పొరేషన్లకు సంవత్సరానికి రూ.750 కోట్ల కేటాయింపు, ప్రతి ఎస్సీ కుటుంబానికి శాశ్వత ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, ఎస్సీ హాస్టల్స్ పునఃనిర్మాణానికి అవసరమైన నిధుల కేటాయింపు, యువతకు సబ్సిడీపై రుణాల కేటాయింపు తదితర ప్రధాన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా పరమేశ్



నియామకపత్రం ఇజేస్తున్న గోవర్ధన్

ఇబ్రహీంపట్నం: పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడిగా వరకాల పరమేష్‌ను నియమించారు. బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె గోవర్ధన్‌యాదవ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ నాలుగోసారి మండల అధ్యక్షుడిగా నియమించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. 22 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవినిచ్చిన వారి ఆశలు వమ్ము చేయకుండా కృషిచేస్తానని తెలిపారు.

విశ్వవిద్యాలయం పేరుమార్పు తగదు



పాపిశెట్టి పురుషోత్తం గుప్తా



మాట్లాడుతున్న కృష్ణాదిశేషు

ఎల్‌బీనగర్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి పేరుమార్పు తగదని కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీఎన్‌రెడ్డినగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొట్టి శ్రీరాములు తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరహారదీక్ష చేశారని ఇలాంటి నాయకులను భాషోద్యమ నాయకుడిగా చూడాలే తప్పా రాజకీయ నాయకుడిగా చూడటం తగదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందు చూపు వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకుంటున్న తరుణంలో తెలుగు యూనివర్సిటీకి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును మార్చాలనుకోవడం భాషాభిమానుల మనోభావాలను గాయపరుస్తుందన్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి పేరు మార్చకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు

పేరు తొలగించడం విరమించుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం విరమించుకోవాలని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మీడియా కమిటీ చైర్మన్ పాపిశెట్టి పురుషోత్తం గుప్తా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరణ నిరాహార దీక్షతో బలిదానం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించి తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు.

మార్గం రాజేశ్‌కు సేవారత్న పురస్కారం



పురస్కారం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

దిల్‌సుఖ్‌నగర్: వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్న వారికి, కళాకారులకు ఎస్ఎల్‌పీ చారిటబుల్ ట్రస్టు–ఎస్‌జేపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. బుధవారం నగరంలో నిర్వహించిన కార్యక్రమానికి టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ఆర్‌కేపురంలోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షులు మార్గం రాజేష్‌కు సేవారత్న పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల అనాథ పిల్లలకు మార్గం రాజేష్ అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. నిస్వార్థంగా, స్వచ్ఛందంగా మార్గం రాజేష్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసిన కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌పీ చైర్మన్ లక్ష్మి ప్రసన్న, ఎస్‌జేపీ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి వెంకట్, ప్రముఖ ప్రజా గాయకులు ఏపూరి సోమన్న పాల్గొన్నారు.

వరదనీటి సమస్యను పరిష్కరించండి



అధికారులతో కలిసి మల్లికార్జున నగర్‌లో పర్యటిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వర్షాకాలంలో మల్లికార్జుననగర్‌లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని శక్తినగర్, మల్లికార్జుననగర్ కాలనీలో బుధవారం ఆయన ఏఈలు కార్తీక్, ప్రజ్ఞతో కలిసి పర్యటించారు. కాలనీలో మోకాళ్ల లోతు నీరు నిలిచి ఇబ్బందులకు గురవుతున్నామని ఈ సందర్భంగా మల్లికార్జుననగర్ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వరద సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. ఆయన వెంట నిరంజన్, ప్రేమ్‌కుమార్, నర్సిరెడ్డి ఉన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి' నిధులు మళ్లించొద్దు

తలకొండపల్లి: పాలమూర్–రంగారెడ్డి ఎత్తిపోతల పథక నిధులను నారాయణ్‌పేట్–కొడంగల్ పథకానికి మళ్లించొద్దని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం తలకొండపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వట్టెం, ఉదండాపూర్ రిజ్వరాయర్ల నుంచి హైలెవల్ కెనాల్స్ నిర్మించి కల్వకుర్తి నియోజక వర్గంలోని తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల్, ఆమనగల్లు మండలాలకు సాగు నీటిని అందించాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి నియోజకవర్గానికి సాగు నీరు అందించి పాలమూర్–రంగారెడ్డి ఎత్తి పోతల పథకానికి కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి పేరు పెడితే ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, రొయ్యల యాదయ్య, శ్రీధర్‌రెడ్డి, శ్రీశైలం, పాండు, శేఖర్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386